క్లుప్తంగా

అసాంఘిక కార్యకలాపాలపై మహిళా పోలీసుల నిఘా ఉండాలి

కర్లపాలెం: గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై మహిళా పోలీసులు నిఘా ఉంచాలని కర్లపాలెం ఎస్‌ఐ ఎం.శివయ్య చెప్పారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మహిళా పోలీసులకు శాంతి భద్రతల పరిరక్షణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో యువతకు, మహిళలకు దిశ యాప్‌పై అవగాహన కల్పించి వారి మొబైల్ ఫోన్‌లలో దిశ యాప్ డౌన్‌లోడ్ చేయాలని చెప్పారు. గ్రామాల్లో ఉత్సవాల సందర్భంగా ఘర్షణలు వాతావరణం ఏర్పడితే.. మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండి, సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. ఒంటరి మహిళలకు మనోధైర్యంగా, అండగా నిలవాలని కోరారు. పేకాట, కోడి పందేలు, బహిరంగ మద్యం సేవించే వారి వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఆదేశించారు.

ఎంఈఓ రత్నశ్రీధర్ బాధ్యతల స్వీకరణ



రేపల్లె: మండల విద్యాశాఖ అధికారిగా కె.రత్నశ్రీధర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పల్నాడు జిల్లా, వినుకొండ మండలం, నడిగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. రేపల్లె ఎంఈవోగా విధులు నిర్వర్తిస్తున్న నవీన్‌కుమార్ చెరుకుపల్లి ఎంఈఓగా బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన రత్నశ్రీధర్‌కు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

నూరుశాతం రికవరీ చేయాలి

భట్టిప్రోలు: స్త్రీ నిధికి సంబంధించి రికవరీలు చేయడం, రుణాలు ఇప్పించడంలో యానిమేటర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని బాపట్ల జిల్లా స్త్రీ నిధి ఏజీఎం కె. నాగబాబు కోరారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్త్రీ నిధి కార్యక్రమంపై యానిమేటర్లతో ఆయన సమీక్షించారు. నాగబాబు మాట్లాడుతూ నూటికి నూరు శాతం రికవరీలు ఉండే విధంగా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్త్రీ నిధి మేనేజర్ పిల్లి అశోక్, మండల సమాఖ్య ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, సీసీలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

'నవ రత్నాలు' అర్హులకు అందాలి

పిట్టలవానిపాలెం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలు సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ మారుతీశేషమాంబ గ్రామ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. చందోలు-1 గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. గ్రామ స్థాయి సమాచారాన్ని సేకరించి, అందజేయాలని సిబ్బందిని కోరారు. గ్రామ ప్రణాళికను తయారు చేసి తద్వారా మండల ప్రణాళిక తయారు చేసేందుకు సహకరించాలని తెలిపారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈఓపీఆర్డీ కొల్లిపర పద్మజ, గ్రామ కార్యదర్శులు శేషగిరిరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మునీర్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించిన ప్రేమ జంట

భట్టిప్రోలు: ఓ ప్రేమ జంట మంగళవారం స్థానిక పోలీసులను ఆశ్రయించింది. కొల్లూరు మండలం తడికలపూడికి చెందిన లంక నాగరాజుకు.. భట్టిప్రోలుకు చెందిన పరింకాల పావనికి ఏడాదిన్నర క్రితం ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఈ నేపథ్యంలో సోమవారం మంగళగిరి సీఎస్ఐ చర్చిలో పాస్టర్ సమక్షంలో వారు వివాహం చేసుకున్నారు. అమ్మాయి తరఫు పెద్దల నుంచి ప్రాణ భయం ఉందని.. వీరు మంగళవారం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఇరువురు మేజర్లు కావడంతో.. అమ్మాయి తరఫు పెద్దలను ఎస్‌ఐ అంబటి చంద్రశేఖర్ పిలిపించి, మాట్లాడారు. బైండోవర్ చేసి ఇరువురిని పంపించి వేశారు.

కుమార్తెకు వేధింపులపై తల్లి ఫిర్యాదు

బాపట్లటౌన్ : కళాశాలలో చదువుకుంటున్న తన కుమార్తెను అదే ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి నిత్యం వేధింపులకు గురిచేస్తున్నారంటూ మండలంలోని జమ్ములపాలెం ఎస్టీ కాలనీకు చెందిన చేవూరి రాజ్యలక్ష్మి మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదుచేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బాపట్ల రూరల్ పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారు, ద్విచక్ర వాహనం ఢీ.. యువకుడికి గాయాలు

కొల్లూరు : ఎదురుగా వస్తున్న కారును ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగ గాయపడిన ఘటన మంగళవారం రాత్రి కొల్లూరులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కొల్లూరు గాంధీ నగర్‌కు చెందిన ఇండ్ల చంద్రశేఖర్ ద్విచక్ర వాహనంపై కొల్లూరు వైపు వస్తున్నాడు. అదే సమయంలో రేకులు లోడ్‌తో వెళ్తున్న వాహనాన్ని తప్పించి ముందుకు వెళుతున్న క్రమంలో ఎదురుగా తెనాలి వైపు వెళుతున్న కారును ఢీకొని, రోడ్డు పక్కనున్న చెట్టుకు కొట్టుకున్నాడు. ప్రమాద ఘటనలో చంద్రశేఖర్ కాలుకు తీవ్ర గాయమయ్యింది.

కుటీర పరిశ్రమలు ఆర్థిక ప్రగతికి దోహదం

మండలాల వారీగా రుణమేళాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓపీఓఆర్డీ

కొల్లూరు: ప్రభుత్వం కల్పిస్తున్న సబ్సిడీ రుణాలతో కుటీర, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని, ఆర్థిక ప్రగతికి బాటలు వేసుకోవచ్చని కొల్లూరు మదర్ థెరీసా మండల సమాఖ్య ఏపీఎం రాము అన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎం ఈ కింద రుణ మేళా నిర్వహించారు. బ్యాంకుల సబ్సిడీ రుణాలతో కుటీర పరిశ్రమలు, వ్యాపారల అభివృద్ధిపై అవగాహన కల్పించారు. ఏపీఎం మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా 35 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందించే రుణ సదుపాయాన్ని వినియోగించుకుని 110 రకాల కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందన్నారు. టెంట్ హౌస్‌లు, వ్యవసాయ పరికరాలు, ఏసీల రిపేర్లు, కంప్యూటర్, జిరాక్స్ సెంటర్లు, పచ్చళ్ల తయారీ వంటి పరిశ్రమల ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న లబ్ధిదారులు తమ పేర్లు ఇస్తే.. బ్యాంక్ రుణం మంజూరు చేయించి పరిశ్రమ ఏర్పాటుకు సహకరిస్తామన్నారు. రూ.5 లక్షల లోపు రుణం తీసుకోదలసిన లబ్ధిదారులకు ఎటువంటి విద్యార్హతతో పనిలేదని, ఆపై రుణం పొందే లబ్ధిదారులు తప్పనిసరిగా కనీసం 8వ తరగతి చదివి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిలుమూరు ఎంపీటీసీ అమిరిశెట్టి శ్రీధర్, బ్యాంకర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు కనపర్తి మోహన్‌రావు, పొలిమట్ల జోసఫ్ పాల్గొన్నారు.

రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలి

కర్లపాలెం: రాయితీ రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని తహసీల్దారు జి.కేశవనారాయణరావు, ఈవోపీఆర్డీ ఎ.ఎలీషాబాబు కోరారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మెగా రుణ మేళా నిర్వహించారు. ఈ మేళాకు మండలంలోని ఏడు సచివాలయాల పరిధిలో 75మంది హాజరయ్యారు. పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు ప్రభుత్వం విభిన్న శాఖల సమన్వయంతో రుణమేళా నిర్వహిస్తోందని తెలిపారు. ఏపీఎం శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం పీఎంఎఫ్ఎంఈ, పీఎం ఈజీపీ, మత్స్యశాఖ ద్వారా సబ్సిడీ రుణాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. 18ఏళ్లు నిండిన వారికి 35 శాతం సబ్సిడీతో సేవా రంగంలో రూ.25లక్షల వరకు, ఉత్పత్తి రంగంలో రూ.50లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉందని ఏపీఎం వివరించారు. ఈ కార్యక్రమంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ మురళీకృష్ణ, యూనియన్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ భరత్, ఇండియన్ బ్యాంకు ప్రతినిధి జ్యోతి, పశువైద్యాధికారి రేచల్ దివ్య, సీసీలు, పాల్గొన్నారు.

రుణ మేళాకు అనూహ్య స్పందన

భట్టిప్రోలు: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం మహిళా లబ్ధిదారులకు నిర్వహించిన క్రెడిట్ క్యాంప్ (రుణ మేళా)కు అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా భట్టిప్రోలు, ఐలవరం, సూరేపల్లి, పల్లెకోన, కోనేటిపురం గ్రామాల నుంచి 294 మంది లబ్ధిదారులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. అనంతరం బ్యాంకర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల సమాఖ్య ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, వైఎస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, గ్రామ సర్పంచ్ బూర్లె రామప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు దున్నా తిరుపతిబాబు, మురుగుడు శ్రీనివాసరావు, గద్దె సుశీల, వెటర్నరీ డాక్టర్ బొర్రా లక్ష్మి రంజిత, బ్యాంక్‌ల బ్రాంచ్ మేనేజర్లు, సీసీలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబనకు అడుగులు

పిట్టలవానిపాలెం: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేదిశగా అడుగులు వేయాలని ఎంపీపీ షేక్ బాజి అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మంగళవారం విభిన్న శాఖల సమన్వయంతో జీవనోపాదుల రుణ మేళా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ భవనం మారుతీ శేషమాంబ,ఈవోపీఆర్డీ పద్మజ, ఏపీఎం సంతోష్ కుమార్, సీసీలు గాంధీ, శేషగిరిరావు డ్వాక్రా మహిళలు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓపీఓఆర్డీ శరత్ బాబు

ప్రతి మహిళా లక్షాధికారి అవడమే ధ్యేయం

బాపట్ల అర్బన్: ప్రతి మహిళ లక్షాధికారి అవడమే ధ్యేయమని బాపట్ల ఈఓపీఆర్డి శరత్ బాబు అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో 2023- 24 ఆర్థిక సంవత్సరం రుణ మేళా నిర్వహించారు. ముఖ్య అతిథిగా శరత్ బాబు హాజరయ్యారు. బాపట్ల మండలంలో 6,201 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి, యూనిట్లు ఏర్పాటుకు ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అలాగే డెయిరీ యూనిట్ల ఏర్పాటుకు పీఎం ఈజీపీ ద్వారా 35 శాతం సబ్సిడీ వర్తిస్తుందని తెలియజేశారు. కో-ఆర్డినేటర్ సుబ్బారావు, బ్యాంక్ మేనేజర్ విక్టోరియా, పశుసంవర్ధక శాఖ అధికారి ప్రసాదరావు, సీసీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఫిషరీ అసిస్టెంట్లు, వెటర్నరీ అసిస్టెంట్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వంద రోజుల పనిదినాలు తప్పనిసరి



సూచనలిస్తున్న డ్వామా పీడీ శంకర్‌నాయక్

కొల్లూరు: జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా వంద రోజుల పనిదినాలు కల్పించాల్సిన బాధ్యత క్షేత్ర స్థాయి సిబ్బందిపై ఉందని డ్వామా పీడీ శంకర్ నాయక్ అన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వేమూరు నియోజకవర్గస్థాయి ఉపాధి హామీ సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా ఉపాధి హామీ పథకం పనుల తీరు తెన్నులను తెలుసుకున్నారు. సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జాబ్‌కార్డు దారులకు మూడో వంతు కూడా వంద రోజుల పని దినాలు కల్పించకపోవడాన్ని గమనించారు. సిబ్బంది పనితీరు మార్చుకుని, జాబ్‌కార్డుదారులకు పనులు పూర్తిస్థాయిలో కల్పించని పక్షంలో శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 50 శాతమైన వంద రోజుల పనిదినాలు కల్పించాలి ్రందేనని సిబ్బందికి తేల్చి చెప్పారు. పనుల్లో అధిక శాతం ఎస్టీ, ఎస్సీలకు చూపించాలని, ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించి, కొబ్బరి, నిమ్మ పంటల సాగును విస్తరింప జేయాలని ఆదేశించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పనిసరిగా గ్రామాల్లోనే ఉంటూ పని జరుగుతున్న ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఆన్‌లైన్ అటెండెన్స్ విధానాన్ని సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. జాబ్‌కార్డు దారుల ఆధార్ సీడింగ్, ఇతర సాంకేతిక సమస్యల పరిష్కారం విషయంలో నిర్లక్ష్య ధోరణిని విడనాడి, సకాలంలో పనులు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఏపీడీ భవాని పాల్గొన్నారు.

రూ.11లక్షల సీఎం ఆర్‌ఎఫ్ నగదు చెక్కు అందజేత

పల్లె రూరల్: ఆరోగ్యశ్రీ పరిధిలోలేని వ్యాధుల భారినపడిన వారిని ఆపత్కాలంలో ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. 22వ వార్డుకు చెందిన పాన్నూరు మురళీధరరావు అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులకు రూ.11లక్షల నగదు చెక్కును తన వ్యక్తిగత కార్యాలయంలో ఎంపీ మంగళవారం అందజేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి..

ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విధి విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు కోరారు. వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతిపక్షాలు విమర్శలను తిప్పికొట్టి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని తెలియజెప్పాలన్నారు. సోషల్ మీడియా ప్రతినిధులకు నిరంతరం అండగా ఉంటామని తెలిపారు.

గృహ నిర్మాణాలపై విమర్శలు తగదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

భట్టిప్రోలు: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు ప్రతిపక్షాలకు కనబడటం లేదా..? అని ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి ప్రశ్నించారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. లబ్ధిదారులను బెదిరించి, గృహాలను నిర్మించాలని అనుకుంటున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి టి.సాయిబాబా చేసిన విమర్శలను ఖండించారు. జగనన్న కాలనీల్లో విద్యుత్, తాగునీటికి కొరత లేదన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేని టీడీపీ నాయకులు కడుపు మంటతో రగిలిపోతున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఇంత మందికి ఇళ్లు ఇచ్చిన దాఖలాలు లేవని గుర్తుచేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నాని), వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, సూరేపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మద్దుల గిరిధర్, ఎంపీటీసీలు గద్దె సుశీల, మురుగుడు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజీ, మల్లోలు నాగబాబు, దాసరి ఫణీంద్ర పాల్గొన్నారు.

'జూడో'లో బాపట్ల క్రీడాకారుడికి సిల్వర్ మెడల్




సాయి రిషిత్‌ను అభినందిస్తున్న జిల్లా జూడో సంఘం సభ్యులు

బాపట్ల అర్బన్: తిరుపతిలో ఈ నెల 18, 19 తేదీల్లో రాష్ట్రస్థాయి జూడో పోటీలు జరిగాయి. 90 కేజీలు పైబడిన ఓపెన్ కేటగిరిలో బాపట్లకు చెందిన మిన్నేకంటు సాయి రిషిత్ సిల్వర్ మెడల్ సాధించాడు. జాతీయస్థాయి అబ్జర్వర్ ఉమేష్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో ఏపీ జూడో అసోసియేషన్ అధ్యక్షుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ పాల్గొన్నారు. ఎం.సాయిరిషిత్ బాపట్ల కో-ఆర్డినేటర్, కోచ్ కె.రఘునాథబాబు, జిల్లా జూడో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.భవనారాయణ ఆధ్వర్యంలో శిక్షణ పొందాడు. ఈ సందర్భంగా సాయిరిషిత్‌ను మంగళవారం జూడో సంఘం సభ్యులు సత్కరించారు. బాపట్లకు మొట్టమొదటిగా జూడోలో మెడల్ సాధించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో బాపట్ల వికాస్ డైరెక్టర్ ఎస్కే నజీర్, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

రూ.2.20 కోట్లతో అభివృద్ధి పనులు

భట్టిప్రోలు: మండలంలోని రెండు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో రూ.2.20 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీవీ చిరంజీవి(తెనాలి) తెలిపారు. మంగళవారం భట్టిప్రోలు విద్యుత్ సబ్ స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గుర్తించిన విద్యుత్ సమస్యలను దాదాపు పరిష్కరించడం జరిగిందన్నారు. మండలంలో అభివృద్ధి పనులు బాగా జరిగాయని, ఏఈ ఏడు కొండలును అభినందించారు. ఈ ఏడాది మండంలో 24 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రూ.3.50 కోట్ల అంచనాలతో వెల్లటూరులో మరో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రస్తుతం టెండర్ల దశలో ఉందని చెప్పారు. ఈ సబ్‌స్టేషన్ ఏర్పాటైతే వినియోగదారులకు నాణ్యమైన కరెంట్‌ను అందించడమే కాక, బ్రేక్ డౌన్, లో -ఓల్టేజ్ తదితతర సమస్యలు ఉండవన్నారు. అలాగే 12 సచివాలయాల పరిధిలో 42 లే-అవుట్లలో విద్యుద్దీకరణ పనులు పూరయ్యాయని చెప్పారు. వినియోగదారులకు దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లో విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందని, ఏమైనా సమస్యలు ఉంటే స్థానిక సబ్‌స్టేషన్, రేపల్లె ఏడీఏ కార్యాలయంలో తెలియ జేయవచ్చని తెలిపారు. ఇప్పటి వరకు 175 కనెక్షన్లు ఇచ్చినట్లు వివరించారు.

కరెంట్ షాక్‌తో యువకుడి మృతి



ఈపూరు విజయకుమార్ (ఫైల్)

కొల్లూరు : కరెంట్ షాక్‌కు గురై.. ఓ యువకుడు మృత్యువాత పడిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. రెవెన్యూ సిబ్బంది, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఈపూరుకు చెందిన ఈపూరు దావీదు గ్రామ వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్నాడు. కొంత కాలంగా దావీదు ఆరోగ్యం సక్రమంగా లేకపోవడంతో అతని కుమారుడు విజయకుమార్ (29) గ్రామంలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. చిలుమూరు గ్రామం వెంబడి ఉన్న కోళ్ల ఫారాలకు విద్యుత్తు సరఫరా అయ్యే.. సర్వీసు వైరు కిందకు వేలాడుతుండటంతో దాన్ని సరిచేసేందుకు వెళ్లాడు. విద్యుత్తు స్తంభాన్ని ఇనుప నిచ్చెన వేసుకుని తీగను సరిచేస్తుండగా.. ఇనుప నిచ్చెన పైనున్న 11 కేవీ వైరుకు తాకడంతో నిచ్చెనకు విద్యుత్తు సరఫరా అయ్యింది. దీంతో పైకి ఎక్కుతున్న విజయకుమార్ షాక్‌కు గురై.. ఘటనా ప్రాంతంలోనే ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబ సభ్యులు వైద్యశాలకు తరలించేందుకు 108ను ఆశ్రయించారు. హుటాహుటిన వెళ్లిన 108 సిబ్బంది పరిశీలించి అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు ధృవీకరించారు. మృతుడుకి భార్య, 5 నెలల కుమారుడు ఉన్నారు. ఘటన సమయంలో ఈపూరు జాన్‌బాబు, ఈపూరు ఎలీషలు ఉండగా ఎలీష గాయాల భారిన పడటంతో అతనిని తెనాలి వైద్యశాలకు తరలించారు. దీనిపై కొల్లూరు పోలీసులు తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. ఫిర్యాదు అందితే.. కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతామని ఏఎస్‌ఐ రామయ్య తెలిపారు.

కౌలు రైతు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

దుండివారిపాలెం(కర్లపాలెం): కౌలు రైతులందరూ తప్పనిసరిగా పంట సాగు గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణాధికారి భాగ్యలక్ష్మి తెలిపారు. సీసీ ఆర్సీ కార్డులపై మంగళవారం బోలాయపాలెం, దుండివారిపాలెం రైతు భరోసా కేంద్రాల వద్ద కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కౌలు గుర్తింపు కార్డులు ఉన్న కౌలు రైతులకు మాత్రమే వైఎస్సార్ రైతు భరోసా, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు పొందేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. కౌలు కౌలు గుర్తింపు కార్డులు పొందేందుకు భూమి యజమాని పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు కౌలు రైతుకు సంబంధించిన ఆధార్ కార్డు జిరాక్స్, 3 పాస్ పోర్ట్ సైజు ఫోటోలు, కౌలు రైతు గుర్తింపు కార్డుకు దరఖాస్తు ఫారంను వలంటీర్లకు, గ్రామ వ్యవసాయ సహాయకులకు లేదా స్థానిక రెవెన్యూ అధికారులకు గాని అందజేయాలని ఏఈవో చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో యశ్వంతి, దుండివారిపాలెం గ్రామ వ్యవసాయ సహాయకులు సునీత, రైతులు పాల్గొన్నారు.

భూ యజమాజమానులకు ఎలాంటి నష్టం లేదు

పిట్టలవానిపాలెం: పంట సాగు దారుల హక్కు పత్రాలపై అవగాహన కలిగిఉండాలని ఎంపీడీఓ భవనం మారుతీ శేషమాంబ తెలిపారు. కోమలి, భవనంవారిపాలెం రైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో సాగుదారులకు పంటసాగు హక్కు పత్రాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి సత్యానంద్ మాట్లాడుతూ కౌలు కార్డుల ద్వారా పొలం యజమానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. 11 నెలల పాటు ఈ సాగు హక్కుపత్రాల కాలపరిమితి ఉంటుందని వెల్లడించారు. భవనంవారిపాలెం గ్రామ సర్పంచ్ మోదుగుల శివనాగేశ్వరి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దొంతిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటరు అపహరణ

బాపట్లటౌన్: విద్యుత్ మోటరు అపహరణకు గురైందంటూ పట్టణంలోని ఏల్చె ఓవర్‌బ్రిడ్జి సమీపంలో ఉంటున్న నిడుమోలు రాజా మంగళవారం రాత్రి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదుమేరకు పట్టణ ఎస్‌ఐ రఫీ కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇదిగో..రాకెట్లను ఇలా ప్రయోగిస్తారు..!



నమూనా రాకెట్లను పరిశీలిస్తున్న విద్యార్థులు



రాకెట్ ప్రయోగం డెమో ఇస్తున్న ప్రతినిధులు

అంతరిక్ష ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన

భట్టిప్రోలు: తిరుపతి జిల్లా, శ్రీహరి కోటలోని సతీష్ ధావన్ స్పేస్ రీసెర్చ్ సెంటర్ నుంచి విద్యార్థులకు అంతరిక్ష ప్రయోగాలపై అవగాహన కల్పిస్తున్న ప్రత్యేక వాహనం మంగళవారం భట్టిప్రోలు మండలానికి వచ్చింది. స్థానిక విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో వివిధ రాకెట్ల నమూనాలను ప్రదర్శనకు ఉంచారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూల్స్‌లోని 9, 10వ తరగతుల విద్యార్థులు అధిక సంఖ్యలో విచ్చేశారు. షార్ ప్రతినిధులు అంతరిక్ష ప్రయోగాలను కళ్లకు కట్టినట్లు విద్యార్థులకు వివరించారు. షార్ ప్రయోగాలు, విజయాలు, తదితరాలను ఒక మోడల్‌గా తయారు చేసి, విద్యార్థులకు విశదీకరించారు. కార్యక్రమాన్ని హైస్కూల్ కరస్పాండెంట్ ఎంపీ వెంకట్రావు, ప్రధానోపాధ్యాయులు ఫణి పార్థసారథి, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

అనుమతులు లేని భాష్యం స్కూల్ సీజ్



నోటీసులు అందజేస్తున్న విద్యాశాఖ అధికారులు

బాపట్ల అర్బన్: బాపట్ల పట్టణంలో అనుమతులు లేవని భాష్యం స్కూల్ ను మంగళవారం డెప్యూటీ డీఈఓ సీజ్ చేశారు. జేసీ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు పాఠశాలను తనిఖీ చేశారు. పట్టణంలోని రెండో వార్డు రైలు పేటలో ఉన్న భాష్యం స్కూల్‌కు విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేవని గుర్తించారు. ఈ కారణంగా సీజ్ చేస్తున్నట్లు డెప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు, బాపట్ల మండల విద్యాశాఖ అధికారి నిరంజన్ తెలిపారు. ఈ సందర్భంగా డెప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో పాఠశాలలకు విద్యాశాఖ అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు. అలాగే పాఠశాలలో స్టేషనరీ, మెటీరియల్స్ తప్పనిసరిగా పాఠశాలలో కొనాలని నిబంధన లేదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాంటి పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చర్చి అభివృద్ధికి ఎంపీ మోపిదేవి రూ.70వేల విరాళం



నగదు గ్రామ పెద్దలకు అందజేస్తున్న ఎంపీపీ శ్రీకృష్ణయ్య

నగరం: మంత్రిపాలెం శివారు బొడ్డువారిపాలెంలో చర్చి అభివృద్ధికి రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు రూ.70వేలు విరాళం అందించారని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య చెప్పారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామంలోని చర్చి అభివృద్ధికి కృషి చేయాలని గ్రామస్తులు ఎంపీ మోపిదేవిని కోరడంతో నగదు విరాళంగా అందించినట్లు పేర్కొన్నారు. నగదును గ్రామ పెద్దలకు అందించినట్లు తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

– డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ విజయమ్మ



జెండా ఊపి ర్యాలీ ని ప్రారంరభిస్తున్న డిఎంఅండ్ ఎచ్ఓ విజయమ్మ

బాపట్ల అర్బన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బాపట్ల జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ అన్నారు. మంగళవారం బాపట్ల పట్టణంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవం, తొమ్మిదో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బాపట్ల మున్సిపల్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డాక్టర్ విజయమ్మ, బాపట్ల జిల్లా మలేరియా అధికారి వై.రాజకుమార్ జెండా ఊపి ప్రారంభించారు. డాక్టర్ విజయమ్మ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వల్లో ఎనాఫిలిస్, క్యూలెక్స్ ఎడీస్ ఈజిప్ట్ అనే ఆడదోమలు దోమకాటు వల్ల మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, బోధకాలు, మెదడువాపు వంటి కీటక జనిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుందన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడేని డ్రైడేగా పాటించాలన్నారు. 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు దైనందిత జీవితంలో యోగ ఒక దినచర్యగా పాటించాలన్నారు. బాపట్ల పట్టణ హెల్త్ సూపర్‌వైజర్ జూగుంట రాంబాబు, పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, నర్సింగ్ విద్యార్థులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం తాగొద్దు అన్నందుకు..పురుగు మందు తాగి

కొల్లూరు : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని జువ్వలపాలెం శివారు గుంటూరుగూడెంకు చెందిన కొల్లూరు రాజేంద్ర ప్రసాద్ (53) మద్యానికి బానిసవ్వడంతో కుటుంబ సభ్యులు మద్యం తాగవద్దని మందలించారు. మనస్థాపానికి గురైన రాజేంద్రప్రసాద్ ఈనెల 14న పురుగుల మందు తాగి, ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్పట్నుంచి చికిత్స చేయిస్తుండగా పరిస్థితి విషమించడంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైద్యశాల నుంచి అందిన నివేదిక ఆధారంగా ఏఎస్‌ఐ అర్జున్ కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నారు.